# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్

శుక్రవారం | 12 జూలై 2024 | పేజీలు 8




మల్లంపేట్ సర్వే నెం.170లో ప్రభుత్వ హెచ్చరిక బోర్డు..

# "పెన్ పవర్ ఎఫెక్ట్"తో..
# ప్రభుత్వ హెచ్చరిక బోర్డు

## లక్ష్మీశ్రీనివాస కన్‌స్ట్రక్షన్ కబ్జాలపై వరుస కథనాలు..

- దుండిగల్ మండలం మల్లంపేట్ లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్‌లో ఆక్రమణల పర్వంపై ప్రత్యేక కథనాలు..
- ప్రభుత్వ భూమికి హెచ్‌ఎండిఏ అనుమతులు అన్న శీర్షికతో సంబంధిత శాఖకు తహశీల్దార్ లేఖ..
- అదనపు కలెక్టర్, ఆర్డీవో ఆదేశాలతో గురువారం ప్రభుత్వ హెచ్చరిక బోర్డు పెట్టిన తహశీల్దార్ మతీన్..
- సుమారు రూ.400 కోట్ల కుంభకోణంపై అధికారుల చర్యలు షురూ..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూలై 11:మల్లంపేట్ లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ కబ్జాలపై "పెన్ పవర్" దినపత్రికలో వచ్చిన వరుస కథనాలతో రెవెన్యూ యంత్రాంగం స్పందించింది.. ఈనెల 5న " ప్రభుత్వ భూమిలో.. హెచ్‌ఎండిఏ అనుమతులు " అన్న కథనంతో మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్పందించారు.. బహుదూర్‌పల్లి సర్వే నెం.227 అక్రమ షెడ్డుపై,..! మల్లంపేట్ విజయలక్ష్మి కబ్జసలపై ఆర్డీవో శ్యామ్ ప్రకాష్‌కి చర్యలకు రెండు రోజుల క్రితమే ఆదేశాలు ఇవ్వడంతో, ఆర్డీవో ఆదేశానుసారం గురువారం దుండిగల్ తహశీల్దార్ సయ్యద్ అబ్దుల్ మతీన్, సర్వేయర్ రూప ఆధ్వర్యంలో..! మల్లంపేట్ లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్‌లో ప్రభుత్వ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.. ఏదిఏమైనప్పటికీ విజయలక్ష్మి విల్లాల్లో సమస్యలు పరిష్కరించ లేకపోయినా జరుగబోయే కబ్జాలకు మాత్రం బ్రేక్ వేశారు.. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ నేతల నుండి సిఫార్సుల ఫోన్‌కాల్స్ ఒత్తిడి పెరిగినందు వల్లే చర్యలకు ఆలస్యం అయినట్లు తెలుస్తోంది.. ప్రభుత్వ బోర్డు ఏర్పాటును, మళ్ళీ సిఫార్సులతో తొలగించే అవకాశం ఉందని పలువురు ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు..

పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్

దుండిగల్ మున్సిపల్ మల్లంపేట గ్రామ సర్వేనెంబర్ 170 / 3, 170/4, 170/5,లోని 12.5 ఎకరాల భూమిలో "లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ తప్పుడు గ్రామపంచాయతీ అనుమతులు సృష్టించి 260 విల్లాల నిర్మాణం చేపట్టారని..! 2021లోనే అప్పటి కలెక్టర్ ఎస్.హరీష్ దుండిగల్ మున్సిపల్ అధికారులను ఆదేశాలు.. టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో వెళ్ళి అసంపూర్తి విల్లాలను సీజ్ చేసి బ్యానర్‌లు.. ఆతర్వాత 208 విల్లాలు నిషేధిత జాబితాలో పెట్టడం..! ఇంతవరకు అధికారుల విధులు బాగానే ఉన్నప్పటికీ..! నేతల పలుకుబడితో బిల్డర్ విజయలక్ష్మి అక్రమ కట్టడాలు పూర్తిచేయడంలో నాలుగు శాఖల అధికారుల అండ లభించింది.. దీంతో గత మార్చినెలలో..! సర్వే నెం.170 ప్రభుత్వ భూమిలో హెచ్‌ఎండిఏ నుండి మరో 17 విల్లాలకు అనుమతులు తెచ్చుకోవడం గమనార్హం.. బడానిర్మాణ సంస్థలకు అధికారుల సహకారం ఎల్లవేళలా ఉంటుందని మరోసారి రుజువు చేశారు..






తహశీల్దార్ సయ్యద్ మతీన్, సర్వేయర్ రూప పర్యవేక్షణలో బోర్డు ఏర్పాటు..



మూడు గ్రామాల అధ్యక్షుల నూతన కమిటీ..

# నిజాంపేట్ కార్పొరేషన్..!
# కమలంలో "కీచులాట"..!



### కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్ టార్గెట్‌గా.. ఏకమైన పార్టీలోని సీనియర్లు..




నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడిగా ఇప్పటి వరకు ఉన్న.. ఆకుల సతీష్..

- కబ్జాలపై పోరాటమే కొంప ముంచుతుందని అంటున్న క్యాడర్..
- కార్పొరేషన్ కమిటీని నీరుగార్చేలా గ్రామ కమిటీల ఏర్పాటు..
- కమలం పార్టీ అంతర్గత వ్యవహారాల్లో చక్రం తిప్పుతున్న ఓ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ..
- బీజేపీలో గ్రూపులకు కారణం అవుతున్న.. పార్టీలో చేరిన బీఆర్ఎస్ మాజీలు..
- గత ప్రభుత్వంలో జరిగిన కబ్జాల పర్వంపై బీజేపీ పోరాటం..
- ఇటీవలే గెస్ట్‌హౌస్ కబ్జా కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తండ్రికి కోర్టు నోటీసులు..
- ఆ తరువాతే బీజేపీ గ్రామ కమిటీల ఏర్పాటులో రాత్రికి రాత్రే ప్రకటన నిర్ణయం..
- గ్రామ కమిటీలు రద్దు చేయకపోతే రాజీనామాలు చేస్తామని కార్పొరేషన్ కమిటీ హెచ్చరిక..
- హడావిడిగా కార్పొరేషన్‌లో.. గ్రామ కమిటీల ఏర్పాటుపై బీజేపీ క్యాడర్‌లో అనుమానాలు..
- బీజేపీ పెద్దల దృష్టికి చేరిన కుమ్ములాటల వ్యవహారం..

కుత్బుల్లాపూర్ నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీలో ముసలం..గతంలో బీఆర్ఎస్ గ్రూప్ రాజకీయాలకు తెరలేపిన కొందరు నేతలే..! ఇప్పుడు బీజేపీ చేరి గ్రూపులకు కారణమవుతున్నారా..? కార్పొరేషన్‌కు మాత్రమే అధ్యక్షుడిగా ఉన్న ఆకుల సతీష్‌పై..! బీజేపీ సీనియర్‌లు తీసుకున్న నిర్ణయం వెనుక చక్రం తిప్పుతున్నది ఎవరు..? ప్రజల ఆస్తులని కాపాడేందుకు సతీష్ పాటుపడటాన్ని సీనియర్‌లకు ఎందుకు తప్పనిపించింది..?పార్టీ నిబంధనలకు విరుద్ధంగా సీనియర్‌లు వ్యవహరిస్తున్నారని, సతీష్ ఆరోపణలపై పార్టీ పెద్దలు ఏం చర్యలు తీసుకోబోతున్నారు..? ప్రభుత్వ ఆస్తుల కబ్జాలపై కొందరు నేతల వసూళ్ళకు ఆటంకం ఏర్పడిందా..? అందుకే బీజేపీలో ముసలం నెలకొన్నది అంటూ సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూలై 11:

-2లో

# మీకు అండగా నేనుంటా
## ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



హైదరాబాద్ పెన్ పవర్:నల్లగొండ జిల్లా చండూరు మున్సిపాల్టీ పారిశుద్ధ్య కార్మికులకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి భరోసా ఇచ్చారు. కొంత కాలంగా తమకు వేతనాలు రావడం లేదని ఈ నెల 1 వతేది నుంచి చండూరు మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన చేశారు. మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రతినెలా వేతనం అందేలా ప్రయత్నిస్తానన్నారు.

-2లో

# ఇంటింటా ఇన్నోవేటర్.. గోడ పత్రిక ఆవిష్కరణ..

- అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఛాంబర్‌లో ఆవిష్కరించారు..
- రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆవిష్కరణల ప్రోత్సహించేందుకు ఇంటింటా ఇన్నోవేటర్ సెల్..
- గృహిణిలు, పాఠశాలలు, కళ్లాశాలల విద్యార్థులు , విద్యావేతలు, వ్యవసాయదారులు ఇలా ఎవ్వరైన..

-3లో




మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఛాంబర్‌లో గోడ పత్రిక ఆవిష్కరణ..

# నిజాంపేట్ కార్పొరేషన్..! కమలంలో "కీచులాట"..!

## గ్రామాల వారీగా కమిటీలు వేస్తే..! నిజాంపేట కార్పొరేషన్ కమిటీ ఏంటి..?

గ్రామాల వారిగా పార్టీని విడదీయడంలో సీనియర్ నాయకుల పన్నాగం ఏంటని ఆకుల సతీష్ ప్రదర్శించారు.. అవినీతి అక్రమాల ఫిర్యాదులపై, సీనియర్ నాయకులు చెప్పినట్లు వినకపోవడమే ఈ విభజన కారణమా..? వెంటనే మూడు గ్రామాల అధ్యక్షులు విభజన ప్రకటన విరమించుకోకుంటే కార్పొరేషన్ కమిటీ సభ్యుల మూక్కుమ్మడి రాజనామాలు చేసేందుకు సిద్ధమైనట్టు అధ్యక్షుడు ఆకుల సతీష్ గురువారం ప్రకటన జారీ చేశారు..
నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో బిజెపి కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కమిటీ వివిధ మోర్చాల కమిటీలు..! పార్టీ నియమ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేయకుండా..! పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, మొన్నటి ఎంపీ ఎలక్షన్లో అత్యధిక మెజార్టీన్ సాధించి ప్రథమ స్థానంలో ఉండేందుకు శ్రమించి నప్పటికీ..! కుత్బుల్లాపూర్ పరిధిలోని కొత్తగా వచ్చిన నాయకులు, మరియు జిల్లా రాష్ట్రస్థాయి సీనియర్ నేతలం అని చెప్పుకునే కొందరు ఈ వ్యవహారానికి తెరలేపినట్టు ప్రకటనలో పేర్కొన్నారు.. దీని వెనుక మరో ప్రజా ప్రతినిధి సహకారంతో పాటు, పరోక్షంగా బిఆర్ఎస్ ప్రజాప్రతినిధిల ప్రోద్బలం ఉందని ఆరోపించారు..


BHARATIYA JANATA PARTY
45-Quthbullapur Assembly Constituency
Flat No. 205, Ushodaya Towers, Shapur Nagar, IDA Jeedimetla, Hyderabad-500 055.TS
Cell : 9440901313 9849273184

Date - 10-07-2024

ప్రెస్ నోట్


భారతీయ జనతా పార్టీ కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ ను పార్టీ సౌలభ్యం కోసం మూడు విభాగాలుగా విభజించడం జరిగింది..

నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతి నగర్ విభాగాలుగా విడదీసి బాచుపల్లి కి ప్రసాద రాజు గారిని, మరియు ప్రగతి నగర్ కు నరేంద్ర చౌదరి గారిని నూతన అధ్యక్షులను నియమించడం జరిగింది.

ఇట్టి నియామకాలు ఈ రోజు నుండి అమలులోకి వస్తాయని జిల్లా ఇన్చార్జ్ అధ్యక్షులు శ్రీ డా ఎస్ మల్లారెడ్డి గారు తెలియజేశారు.

J K శేఖర్ యాదవ్
అసెంబ్లీ కన్వీనర్

నూతన కమిటీ నియామకానికి, అసెంబ్లీ కన్వీనర్ శేఖర్ యాదవ్ రాత్రికి రాత్రే ఇచ్చిన ప్రకటన..


BHARATIYA JANATA PARTY
MEDCHAL - MALKAJGIRI DISTRICT ( URBAN )

Dr. S. Malla Reddy
District Convener
9440901313

నియామక పత్రం

Date - 10-07-2024

శ్రీ ఎన్ ప్రసాదరాజు గారికి

మీరు భారతీయ జనతా పార్టీ బాచుపల్లి అధ్యక్షులుగా నియమించబడినారు అని తెలియజేయుటకు సంతోషిస్తున్నాను.

బీజేపీ సిద్ధాంతం మరియు ఆదర్శాలకు అంకితమై, పార్టీలో అందరితో సమన్వయంతో పనిచేస్తూ, పార్టీ కార్యక్రమాలలో మరింత చురుకుగా పాల్గొంటూ, పార్టీ విస్తరణకు కృషి చేస్తారని ఆశిస్తూ..

Dr S Malla Reddy
District Convener

#205, Ushodaya Towers, Shapur Nagar, Cross Road, Quthbullapur, Medchal-Malkajgiri District, Telangana., - 500 055. email : drsmallreddy@yahoo.co.in

నూతన కమిటికి నియామకంపై జిల్లా కన్వీనర్ ఎస్.మల్లారెడ్డి నియామక పత్రం..

## బీజేపీని లేకుండా చేసే కుట్రలో భాగమే..!

గత రెండు సంవత్సరాలుగా నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్ష పీఠంలో ఉన్న సతీష్‌ను తొలగించడానికి ప్రయత్నాలు సఫలం కాకపోవడంతో..! చివరి అస్త్రంగా కార్పొరేషన్ కమిటీ ఉనికే లేకుండా చేయడానికి నిజాంపేట్ కార్పొరేషన్‌ని, బాచుపల్లి, నిజాంపేట్ ,ప్రగతి నగర్ గ్రామాలుగా విడదీసే కుట్రలో భాగమేనని ఆకుల సతీష్ ఆరోపించారు.. కార్పొరేషన్ పరిధిలోని సీనియర్ నాయకులను, కార్పొరేషన్ కమిటీని సంప్రదించకుండానే ఏకపక్షంగా పార్టీ నియమ నిబంధనలకు విరుద్ధంగా నిన్న రాత్రి దొంగ చాటుగా బాచుపల్లి గ్రామానికి మరియు ప్రగతి నగర్ గ్రామానికి అధ్యక్షుల ప్రకటన చేయడంపై నిజాంపేట్ కార్పొరేషన్ బిజెపి కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది.. పార్టీ నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేషన్ని మళ్లీ గ్రామాలుగా ఏ విధంగా విడదీస్తారని ,గ్రామ కమిటీ అధ్యక్షులని ఏ విధంగా నియామకం చేస్తారని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని అన్నారు..

నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీలో కీచులాటకు అసలు కారణాలు ప్రధానంగా.. నిజాంపేట్ సర్వే నెంబర్ 283 పట్టాభూమిలో నిర్మాణ అనుమతులతో..!సర్వే నెం. 233/13, 15 ప్రభుత్వ భూమిలో అక్రమంగా అపార్ట్‌మెంట్ నిర్మాణపై సతిష్ కలెక్టర్‌కు ఫిర్యాదు,..! మల్లంపేట్ లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్‌లో ప్రభుత్వ భూమి, కేవిఆర్ లేఅవుట్‌లో పార్కుస్థలాలు కబ్జా చేస్తూ.. పోర్జరీ సంతకాలతో తప్పుడు రిజిస్ట్రేషన్‌లపై సతీష్ ఫిర్యాదు.. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు గెస్ట్‌హౌస్ కబ్జాపై పలుమార్లు ప్రెస్‌మీట్, ఎమ్మెల్సీ తండ్రికి హైకోర్టు నోటీసులు.. వీటన్నిటిపై ఆకుల సతీష్ ఫిర్యాదు చేసినందుకే.. కొందరు నేతల వసూళ్ళకు అడ్డంకిగా ఉన్నందుకు అధ్యక్షుడిగా తొలిగించే కార్యం తలపెట్టినట్లు స్పష్టమవుతుంది.. కార్పొరేషన్ కాబట్టి కంట్రోల్‌లో ఉన్నాని, అదిలేకున్నా ప్రజా క్షేత్రంలో ఫైట్ చేయడానికి అడ్డులేదని సతీష్ తెలిపారు..

కుత్బుల్లాపూర్‌లో నిజాంపేట్ కార్పొరేషన్ బిజెపి పార్టీ పనితీరుతో ప్రత్యేకగుర్తింపు తెచ్చుకున్నప్పటికీ..! బీజేపీలో సీనియర్ నాయకులుగా చెప్పుకునే కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం కార్పొరేషన్‌లో కమిటీని నిర్వీర్యం చేయడంపై నిజాంపేట్ బిజెపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.. శుక్రవారం ఉదయం 9 గంటలలోపు కార్పొరేషన్‌లో గ్రామాల వారీగా విభజన, గ్రామ అధ్యక్షుల ప్రకటన, వెనుకకు తీసుకోకపోతే.. పది గంటలకి కార్పొరేషన్ సంబంధించిన బిజెపి నాయకులు తమ తమ పదవులకి రాజనామ చేసి, నిరసన తెలుపుతామని హెచ్చరించారు..

- మొదటి పేజి తరువాయి

నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ కమిటీకి విరుద్దంగా మూడు గ్రామాల అధ్యక్షుల నియామకం ఆ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది..! ప్రస్తుత అధ్యక్షుడు ఆకుల సతీష్‌పై కుట్రలో భాగమేనని పలువురు తీవ్రంగా ఖండిస్తున్నారు.. మరోవైపు ఎవరికి తెలియకుండా పార్టీ నిబంధనలకు విరుద్ధంగా జిల్లా రాష్ట్రస్థాయి నాయకులు నిజాంపేట్ బిజెపిని గ్రామాల వారిగా విడదీయడం వెనుకపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.. బిజెపి అధ్యక్షుడు ఆకుల సతీష్ టార్గెట్‌గా సీనియర్ నాయకుల పనే అంటూ ఆకుల సతీష్ ఆరోపిస్తున్నారు.. బిజెపి పార్టీ గ్రామాల విభజన వ్యవహారంలో బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధి, బడా బిల్డర్లు, ఓ బిజెపి ప్రజాప్రతినిధి తెరవెనుక నుండి నడిపిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.. బిజెపి పార్టీ రాజ్యాంగబద్ధం ప్రకారం కార్పొరేషన్‌లో గ్రామాల అధ్యక్షులు నిబంధనలకు విరుద్ధం అంటూ సతీష్ ఆరోపణ.. పార్టీ నిబంధనల ప్రకారం కాదని, కేవలం సీనియర్ నాయకులే బిజెపి గ్రామ అధ్యక్షుల నాటకానికి తెరలేపినట్టు ఆయన ఆరోపించారు.. బీజేపీ పార్టీని నిర్వీర్యం చేసే చర్యలంటూ, బిజెపి సీనియర్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..రాష్ట్ర వ్యాప్తంగా రెండు నెలల్లో రాష్ట్ర జిల్లా మండల నూతన కమిటీల నియామకం ఉన్న నేపథ్యంలో..! ఈ హడావిడి ఏమిటని ఆగ్రహం.. రాష్ట్రంలో ఏ మున్సిపాలిటీలో లేని గ్రామ కమిటీలు నిజాంపేట కార్పొరేషన్‌లో ఎందుకని పార్టీ పెద్దలు చర్చించినట్లు సమాచారం..

# మీకు అండగా నేనుంటా

- మొదటి పేజి తరువాయి

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి హామీ ఇవ్వడంతో పారిశుద్ధ్య కార్మికులు ఆందోళన విమరమించారు. అధికారులతో చర్చించి మున్సిపాలిటీలో ఆదాయ వనరులను సమకూర్చుకోవాలని చండూరు మున్సిపల్? కమిషనర్? ను ఆదేశించారు. మున్సిపాల్టీకి రావలసిన ఇంటి పన్నులు.. ఇతర పన్నులు వసూలు చేసి పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వాలని సూచించారు.

# తాగి నడిపేవాళ్లు ఎక్కువయ్యారు: డ్రంక్ అండ్ డ్రైవ్ లో..10రోజుల్లో 16 వందల మందిపై కేసు

హైదరాబాద్ పెన్ పవర్:హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు షాకింగ్ న్యూస్ చెప్పారు. రోజురోజుకు తాగి బండ్లు నడిపే వారి సంఖ్య పెరుగుతోందని అంటున్నారు. కేవలం పదిరోజులు నిర్వహిం చిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఏకంగా 16 వందల మందిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. జూలై 1నుంచి జూలై 10 వరకు హైదరాబాద్ నగర వ్యాప్తంగా నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో తాగి వాహనాలు నడుపుతున్న 1,614 మందిపై కేసులు నమోదు చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో వివిధ కోర్టుల్లో మొత్తం 992 ఛార్జ్ షీట్లు దాఖలు చేశారంటే.. నగరంవాసులు ఎంతలా తాగి ఊగుతూ బండ్లు నడుపుతు న్నారో అర్థమవుతోంది. అంతేకాదు.. వీరిలో 55 మందికి 15 రోజుల జైలు శిక్ష పడింది. 8మంది డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేశారు. మొత్తంగా తాగి బండ్లు నడిపిన మందుబాబు లనుంచి 21లక్షల 36వేల రూపాయల జరిమానాకూడా వసూలు చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారంతా



ఎక్కువా బైకర్లే ఉన్నారు. టూవీలర్ నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ చెకింగ్ లో మొత్తం 1346 మంది దొరికారు. వీరందరికి గోషామహల్, బేగంపేట టీటీల వద్ద కౌన్సెలింగ్ కూడా ఇచ్చారు ట్రాఫిక్ పోలీసులు. మళ్లొక్క సారి పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్సులు శాశ్వతంగా రద్దు చేస్తామని హెచ్చరించారు.

# తాగితే తాగారు కానీ సీసాలు పగలకొట్టకండి..

ఏపీలో మందుబాబులకు ప్రభుత్వ ఉపాధ్యాయుడి విజ్ఞప్తి

గ్రామంలో డప్పుతో చాటింపు వేసిన విజయనగరం స్కూలు టీచర్

పొలాల్లో సీసాలు పగలగొట్టడం వల్ల రైతులు అవస్థపడుతున్నారని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:**'మద్యపానం హానికరమనే విషయం విస్మరించి తాగుతున్నారు.. మీ సంతోషం కోసం తాగితే తాగారు కానీ సీసాలు మాత్రం పగలగొట్టకండి' అంటూ ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు డప్పుతో దండోరా వేస్తూ, పిల్లలతో కలిసి గ్రామ వీధుల్లో ప్రచారం చేశారు. మద్యం సీసాలు పగల కొట్టడం వల్ల పొలాల్లో రైతులు అవస్థపడుతున్నారని, గాజు ముక్కలు గుచ్చుకుని మూగజీవాలు నెత్తురోడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వైరల్ గా మారిన ఈ వీడియో విశేషాలు.. విజయనగరం జిల్లా, తెర్లాం మండలం, నందబలగ జెడ్పీహెచ్ఎస్ టీచర్ మోహన్ రావు తన విద్యార్థులతో కలిసి ఊర్లో ర్యాలీ తీశారు. డప్పుతో దండోరా వేస్తూ మందుబాబులకు విజ్ఞప్తి చేశారు. మద్యం సేవించాక ఖాళీ సీసాలను పగలగొట్టవద్దని చెప్పారు. పగిలిన ముక్కలను పంట పొలాల్లో పడేస్తే రైతులు, కూలీలకు గాయాలవుతాయని, రోడ్డు పక్కన పడేస్తే మూగజీవాలకు ఇబ్బందని తెలిపారు. ఆ సీసాలను అలాగే అక్కడే వదిలేస్తే పాత సీసాలు ఏరుకునే వారికి నాలుగు రూపాయలు వస్తాయని టీచర్ మోహన్ రావు గుర్తుచేశారు. ఇకపై ఎవరూ మద్యం సీసాలను పగలగొట్టవద్దంటూ గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ గురించి ఎవరూ ఆందోళన చెందొద్దు: కుమారస్వామి

వైజాగ్ పర్యటనకు వచ్చిన కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి

స్టీల్ ప్లాంట్ లోని విభాగాలను పరిశీలించిన కేంద్ర మంత్రి

ప్లాంట్ లో వంద శాతం సామర్థ్యంతో ఉత్పత్తి జరుగుతుందని భరోసా



**హైదరాబాద్ పెన్ పవర్:**విశాఖ స్టీల్ ప్లాంట్ ను రక్షించడం తమ బాధ్యత అని కేంద్ర పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి అన్నారు. వైజాగ్ పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి కాసేపటి క్రితం స్టీల్ ప్లాంట్ ను సందర్శించారు. ప్లాంట్ లోని వివిధ విభాగాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విశాఖ స్టీల్ ప్లాంట్ పై ఆధారపడి ఎన్నో కుటుంబాలు బతుకుతున్నాయని చెప్పారు. ప్లాంట్ మూతపడుతుందని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ప్రధాని మోదీ ఆశీస్సులతో ప్లాంట్ లో వంద శాతం సామర్థ్యంతో ఉత్పత్తి జరుగుతుందని భరోసా ఇచ్చారు. మరోవైపు స్టీల్ ప్లాంట్ లో కుమారస్వామిని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కలిశారు.

# ఇంటింటా ఇన్నోవేటర్.. గోడ పత్రిక ఆవిష్కరణ..

అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఛాంబర్‌లో ఆవిష్కరించారు..

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆవిష్కరణల ప్రోత్సహించేందుకు ఇంటింటా ఇన్నోవేటర్ సెల్..

గృహిణిలు, పాఠశాలలు, కళ్లాశాలల విద్యార్థులు , విద్యావేతలు, వ్యవసాయదారులు ఇలా ఎవ్వరైన..

### దరఖాస్తు చేసుకొనే విధానం :-

- పేరు , వయస్సు , ఫోటో , వృత్తి , చిరునామా , మండలం , జిల్లా .
- ఆవిష్కరణ పేరు
- ఆవిష్కరణ వివరిస్తూ 100 పదాలలో రాసి పంపండి .
- ఆవిష్కరణ యొక్క 4 ఫోటోలు.
- ఆవిష్కరణ వీడియో 2 నిమిషాలు .
- పైన చెప్పిన వివరాలు అన్నియు తెలంగాణ ఇన్నోవేటర్ సెల్ వాట్సాప్ నెంబర్ 9100678543 కు ఆగష్టు 3వ తేదీ 2024. లోపు పంపించాలని పేరుకొన్నారు .
- ఆగష్టు 15వ తేదీ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆవిష్కరణల ప్రదర్శన ఉంటుందని అన్నారు.
- ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి సాంబశివరావు, డిపిఓ వెంకయ్య, వ్యవసాయ అధికారి రేఖ మేరీ ఈ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ భాను ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..



మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి చాంబర్‌లో గోడ పత్రిక ఆవిష్కరణ..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూలై 11:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు..! ఇంటింటా ఇన్నోవేటర్ సెల్ ఏర్పాటు చేసిందని, గృహిణి , పాఠశాలలు, కళాశాలల స్థాయి విద్యార్థులు, విద్యావేత్తలు, వ్యవసాయ దారులు ఎవరైనా ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో పాల్గొనవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డి తెలిపారు గురువారం అదనపు కలెక్టర్ కార్యాలయ ఛాంబర్‌లో నిర్వహించిన ఇంటింటా ఇన్నోవేటర్ గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక సమస్యలను పరిష్కరించే వినూత్న ఆవిష్కరణలు పంపించే అవకాశం ఇంటింటా ఇన్నోవేటర్ కల్పిస్తుందని తెలిపారు. వినూత్న ఆవిష్కరణలు దరఖాస్థు చేసుకోవడానికి చివరి తేదీ 3 ఆగష్టు 2024 అన్నారు..

ప్రతి ఒక్కరికి అవకాశం కల్పించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఇంటింటా ఇన్నోవేటర్ సెల్ ఏర్పాటు చేసిందని,గృహిణి నుంచి పాఠశాలలు, కళ్లాశాలలు స్థాయి విద్యార్థులు , విద్యావేతలు , వ్యవసాయదారులు ఇలా ఎవ్వరైన ఇందులో పాల్గొనవచ్చుని అయన తెలిపారు..

# పార్టీ ఫిరాయింపుల పిటిషన్‌పై హైకోర్టులో విచారణ.. సోమవారానికి వాయిదా




**హైదరాబాద్ పెన్ పవర్:** పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ పై గురువారం ( జూలై 11) తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేం దర్, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి , భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావులపై అనర్హత వేటు వేయాలని బీఆర్ ఎస్ నేతలు పిటిషన్ వేశారు. గురువారం హైకోర్టు విచారణ సందర్భంగా అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి కోర్టుముందు వాదనలు వినిపించారు. వాదోపవాదాలు విన్న హైకోర్టు .. తదుపరి విచారణను సోమవారానికి (జూలై 15, 2024కు )వాయిదా వేసింది. పార్టీ ఫిరాయింపులపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ చర్యలు తీసుకోవడం లేదని బీఆర్ ఎస్ ఎమ్మెల్యే వివేకానంద న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. కడియం శ్రీహరి, దానం నాగేదర్, తెల్లం వెంకట్రావులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగా గెలిచి కాంగ్రెస్ లో చేరారని తెలిపారు. వీరిపై స్పీకర్ కు ఫిర్యాదు చేసినప్పటికీ ఆయన చర్యలు తీసుకోలేదని, కోర్టు స్పందించి ఆ ఎమ్మెల్యేలపై స్పీకర్ చర్యలు తీసుకునేలా చేయాలని వివేకానంద పిటిషన్ లో వెల్లడించారు.

# టీడీపీ కార్యకర్తల్లో ఒక్కరి తల తీసినా చంద్రబాబు పారిపోతారని అనుచరుల్ని జోగి రమేశ్ రెచ్చగొట్టారు: ప్రత్యక్ష సాక్షి వాంగ్మూలం

- **2021లో చంద్రబాబు ఇంటిపై జోగి రమేశ్, ఆయన అనుచరుల దాడి**
- **ఐదారు కార్లలో కర్రలతో వచ్చి దాడికి దిగారన్న తమ్మ శంకర్‌రెడ్డి**
- **వారించిన తమపైనా దాడి చేశారని వెల్లడి**
- **నిన్న డీఎస్పీ ఎదుట వాంగ్మూలం**



**హైదరాబాద్ పెన్ పవర్:**చంద్రబాబునాయుడు ఇంటిపై వైసీపీ నేతల దాడికి సంబంధించిన కేసులో ప్రత్యక్ష సాక్షి తమ్మా శంకర్‌రెడ్డి పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంతో వైసీపీ నేత జోగి రమేశ్ మెడచుట్టూ ఉచ్చు బిగుసుకుంటోంది. వైసీపీ హయాంలో 17 సెప్టెంబర్ 2021లో ఎమ్మెల్యే జోగి రమేశ్ తన అనుచరులతో కలిసి చంద్రబాబునాయుడి ఇంటిపై దాడి చేశారు. అప్పట్లో ఈ కేసు ముందుకు సాగలేదు సరికదా, బాధితులపైనే పోలీసులు కేసులు పెట్టారు. తాజాగా, ఈ కేసులో కదలిక వచ్చింది. దర్యాప్తు వేగం పుంజుకుంది. నాటి ఘటనలో ప్రత్యక్ష సాక్షి అయిన ఉండవల్లికి చెందిన తమ్మా శంకర్‌రెడ్డి నిన్న పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. చంద్రబాబు ఇంటి వద్దనున్న టీడీపీ కార్యకర్తల్లో ఒక్కరి తల తీస్తే చాలని, చంద్రబాబు భయపడి ఇల్లు వదిలి పారిపోతారని జోగి రమేశ్ తన అనుచరులను ఉసిగొల్పినట్టు ఆయన తన వాంగ్మూలంలో పేర్కొన్నారు. అనంతరం ఆయన ఓ టీవీ చానల్‌తో మాట్లాడుతూ ఆ రోజు ఏం జరిగిందీ గుర్తుచేసుకున్నారు.

చంద్రబాబును కలిసేందుకు ఉండవల్లి నుంచి స్నేహితులతో కలిసి వెళ్లానని, ఉదయం 11.30 గంటల సమయంలో ఐదారు కార్లలో జోగి రమేశ్, ఆయన అనుచరులు వచ్చారని, కర్రలతో వస్తున్న వారిని పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. గొడవ జరుగుతుండడంతో వెళ్లిన తమను కూడా కొట్టారని పేర్కొన్నారు. 'చంద్రబాబును తరిమేద్దాం. వీళ్లలో ఒక్కడిదైనా తల తీసి చంపేస్తే అప్పుడు చంద్రబాబు ఇల్లు వదిలి పారిపోతారు. ఇక ఆంధ్రాకు తిరిగిరారు' అని జోగి రమేశ్ హెచ్చరించారని వివరించారు.

గద్దె రామ్మోహన్, బుద్దా వెంకన్న, తాను, తన స్నేహితులు కలిసి జోగి రమేశ్‌ను వారించామని, ఏదైనా ఉంటే కూర్చుని మాట్లాడుకోవాలని చెప్పినందుకు కర్రలతో తమ తలలపై కొట్టారని గుర్తుచేసుకున్నారు. డీఎస్పీ పిలిస్తే వచ్చి వాంగ్మూలం ఇచ్చినట్టు శంకర్‌రెడ్డి వివరించారు.

## ఒక్క రూపాయి ఆదాయపు పన్ను వివాదం.. సీఏకు రూ. 50 వేల చెల్లింపు!

**ఇన్‌కమ్ ట్యాక్స్ నుంచి నోటీసు అందుకున్న అపూర్వ్ జైన్**

**దానిని పట్టుకుని సీఏ వద్దకు వెళ్తే రూ. 50 వేల ఫీజు**

**చివరికి ఆ నోటీసు రూపాయి వివాదానికి సంబంధించినదని తేలిన వైనం**

**నెత్తీనోరూ బాదుకుంటూ సోషల్ మీడియాకెక్కిన అపూర్వ్ జైన్**



**హైదరాబాద్ పెన్ పవర్:**ఆదాయపన్ను శాఖతో రూపాయి విలువైన వివాదం పరిష్కారానికి ఢిల్లీకి చెందిన ఓ వ్యక్తి చార్టెడ్ అకౌంటెంట్‌కు ఏకంగా రూ. 50 వేలు సమర్పించుకున్నాడు. ఈ విషయాన్ని ఆయన స్వయంగా ఎక్స్ ద్వారా వెల్లడించాడు. తాను జోక్ చేయడం లేదని చెప్పుకొచ్చాడు. అపూర్వ్ జైన్‌కు ఇన్‌కమ్ ట్యాక్స్ కార్యాలయం నుంచి ఇటీవల ఓ నోటీసు వచ్చింది. అయితే, అది ఎందుకొచ్చిందో తెలుసుకునేందుకు దానిని పట్టుకుని చార్టెడ్ అకౌంటెంట్ వద్దకు వెళ్లాడు. ఆ నోటీసు సంగతేంటో తెలుసుకునేందుకు ఆ సీఏ ఏకంగా రూ. 50 వేలు ఫీజుగా తీసుకున్నాడు. చివరికి తేలిందేంటంటే ఆ వివాదం కేవలం ఒక్క రూపాయికి సంబంధించినదని! అసలు విషయం తెలిశాక అపూర్వ్ నోరెళ్లబెట్టాడు. రూపాయి కోసం రూ. 50 వేలు పోగొట్టుకున్నట్టు తెలిసి నెత్తీనోరు బాదుకున్నాడు.

ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పెట్టి తన ఆవేదన వెళ్లగక్కాడు. ఇది చూసిన నెటిజన్లు రెండుగా విడిపోయి చర్చకు తెరదీశారు. కొందరు ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేయగా, మరికొందరు జైన్‌ను తప్పుబడుతున్నారు. వివాదంలో ఉన్న మొత్తం గురించి అతడు ముందే ఎందుకు చెప్పలేదని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి చిన్న మొత్తాల విషయంలో సీఏ జోక్యం లేకుండానే పరిష్కరించుకోవచ్చని చెబుతున్నారు. చాలామంది ట్యాక్స్ టెర్రరిజం బారిన పడుతున్నారని మరికొందరు ఆవేదన వ్యక్తం చేశారు.

## రాహుల్ గాంధీ చెంపలు వాయించాలన్న బీజేపీ ఎమ్మెల్యేపై కేసు

**పార్లమెంటులో రాహుల్ శివుడి ఫొటో ప్రదర్శించడంపై భరత్‌శెట్టి వివాదాస్పద వ్యాఖ్యలు**

**హిందువులను హింసావాదులుగా ముద్ర వేస్తున్నారని మండిపాటు**

**చెంపదెబ్బలకు రాహుల్ అర్హుడేనని వ్యాఖ్య**

**కాంగ్రెస్ నేత ఫిర్యాదుపై మంగళూరులో కేసు నమోదు**



**హైదరాబాద్ పెన్ పవర్:**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన కర్ణాటకలోని మంగళూరు నార్త్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే వై.భరత్‌శెట్టిపై కేసు నమోదైంది. మంగళూరు సిటీ కార్పొరేషన్ సభ్యుడు అనిల్‌కుమార్ ఫిర్యాదుపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పార్లమెంటులో శివుడి ఫొటోను ప్రదర్శించిన రాహుల్‌గాంధీ చెంపలు పగలగొట్టాలంటూ భరత్‌శెట్టి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శివుడి మూడో కన్నును రాహుల్ విస్మరిస్తున్నారని, అది ఎవరినైనా బూడిదగా మార్చేస్తుందని పేర్కొన్నారు. హిందువులను హింసావాదులుగా ముద్రవేస్తున్న రాహుల్ చెంపదెబ్బకు అర్హుడేనంటూ వివాదాదస్పద వ్యాఖ్యలు చేశారు. భరత్ వ్యాఖ్యలపై వివాదం రాజుకుంది. కాంగ్రెస్ నాయకులు నిరసనలకు దిగారు. భరత్‌శెట్టికి నిజంగానే అంత ధైర్యం ఉంటే కనీసం తమ కార్యకర్తపైన అయినా చెయ్యెత్తాలని కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి బి.రామనాథరాయ్ సవాలు విసిరారు. కాగా, అనిల్ కుమార్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మంగళూరు డీసీపీ సిద్ధార్థ్ గోయల్ తెలిపారు.

## తెలంగాణలో తాత్కాలికంగా నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు

తాత్కాలికంగా నిలిపివేసినట్లు వెల్లడించిన స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ

గురువారం మధ్యాహ్నం నుంచి అంతరాయం ఏర్పడినట్లు వెల్లడి

రద్దీగా ఉన్నచోట్ల రేపు రావాలని సూచించామన్న అధికారులు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్లు తాత్కాలికంగా నిలిచిపోయాయి. ఈ మేరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ తెలిపింది. సాంకేతిక సమస్య కారణంగా గురువారం మధ్యాహ్నం నుంచి అంతరాయం ఏర్పడినట్లు అధికారులు వెల్లడించారు. రిజిస్ట్రేషన్‌లకు ఆధార్ లింక్ కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తినట్లు తెలిపారు. యూడీఐఏలో ఈకేవైసీ వెరిఫికేషన్‌కు సంబంధించి సాంకేతిక సమస్య ఉందని అధికారులు చెప్పారు. దీనిని పరిష్కరించేందుకు టెక్నికల్ నిపుణుల ద్వారా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ల కోం వచ్చిన వారు టెక్నికల్ సమస్య వల్ల ఇబ్బంది పడ్డట్లు తెలిపారు. సాంకేతిక సమస్య పరిష్కారమైతే వేచి ఉన్నవారి రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. రద్దీగా ఉన్న చోట్ల మాత్రం రేపు రావాలని సూచించామన్నారు.

## అభిప్రాయాలు తెలుసుకోవడానికే రైతు భరోసాపై సదస్సులు: భట్టివిక్రమార్క



**హైదరాబాద్ పెన్ పవర్:** రైతు భరోసాపై అందరి అభిప్రాయాలు తెలుసుకోవడానికే సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. ఈరోజు ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో రైతు భరోసా వర్క్ షాప్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మంత్రివర్గ ఉపసంఘం ఆధ్వర్యంలో రైతు భరోసా పథకం విధివిధానాలపై రాష్ట్రవ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో అభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. అన్నదాతల అభిప్రాయాల మేరకే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు.రైతు భరోసా వర్క్ షాప్ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ... తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి యోచిస్తున్నట్లు చెప్పారు. చిన్న రైతుల కోసం పథకాల రూపకల్పనకు ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు.ప్రజలతో చర్చించి పథకాలు అమలు చేయడమే తమ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రజల నుంచి సేకరించిన అభిప్రాయాలపై అసెంబ్లీలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు.

# తిరుమల క్యూలైన్‌లో ఫ్రాంక్ వీడియో... విజిలెన్స్ విచారణకు ఆదేశించిన టీటీడీ

దర్శన క్యూ లైన్లలో తమిళుల ఆకతాయిల ఫ్రాంక్ వీడియో

నారాయణగిరి షెడ్స్‌లోని క్యూలో కంపార్ట్‌మెంట్ తాళాలు తీసేందుకు యత్నిస్తూ వీడియో

ఇన్‌స్టాగ్రాంలో వీడియో పోస్ట్... తమిళనాడులో ఆందోళనలు



**హైదరాబాద్ పెన్ పవర్:**తిరుమల శ్రీవారి ఆలయ ప్రాంగణంలో ఫ్రాంక్ వీడియోలు తీయడంపై టీటీడీ ఆగ్రహం వ్యక్తం చేసింది. దర్శన క్యూ లైన్లలో కొందరు ఆకతాయిలు ఈ ఫ్రాంక్ వీడియోలు తీశారు. తమిళనాడుకు చెందిన టీటీఎఫ్ వాసన్ తన మిత్రులతో కలిసి శ్రీవారి దర్శనానికి వచ్చాడు. ఈ క్రమంలో క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులతో తాళాలు తీస్తున్నట్లు ఫ్రాంక్ వీడియో తీశాడు. అతను నారాయణగిరి షెడ్స్‌లోని క్యూలో కంపార్ట్‌మెంట్ తాళాలు తీసేందుకు ప్రయత్నిస్తున్నట్లుగా నటిస్తూ వీడియో తీశాడు. అయితే అతను అలా చేస్తున్న సమయంలో అక్కడ ఉన్న భక్తులు... వీరిని టీటీడీ సిబ్బందిగా భావించారు. తాళాలు తీస్తున్నారేమోనని ఆశగా చూశారు. కానీ వాసన్, అతని స్నేహితులు వెకిలిగా నవ్వుతూ అక్కడి నుంచి పరుగు తీశారు. చూస్తే అది ఫ్రాంక్ వీడియో. దీనిని వారు ఇన్‌స్టాగ్రాంలో పోస్ట్ చేశారు. ఈ వీడియోపై తమిళనాడులో పెద్ద ఎత్తున ఆందోళనలు చెలరేగాయి. ఈ విషయం టీటీడీ దృష్టికి రావడంతో ఆగ్రహం వ్యక్తం చేసింది. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. టీటీడీ విజిలెన్స్ శాఖ విచారణకు ఆదేశించింది. సాధారణంగా నారాయణగిరి షెడ్స్ దాటి వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌కు ప్రవేశించే ముందే భక్తుల నుంచి సెల్ ఫోన్లు డిపాజిట్ చేయిస్తారు. నిత్యం భక్తుల గోవింద నామాలతో మారు మ్రోగే తిరుమల కంపార్ట్‌మెంట్‌లలో ఆకతాయిలు చేసిన చేసిన ఫ్రాంక్ వీడియోపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నామాలు పెట్టుకుని.. వేంకటేశ్వరస్వామికి, టీటీడీ ఆస్తులకు పంగనామాలు పెట్టారు: బండి సంజయ్

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న బండి సంజయ్

తిరుమలను అపవిత్రం చేశారంటూ గత ప్రభుత్వంపై విమర్శలు

వీరప్పన్ వారసుల చేతిలో టీటీడీ పాలన సాగిందని మండిపాటు



**హైదరాబాద్ పెన్ పవర్:**గత వైసీపీ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. టీటీడీని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారని విమర్శించారు. స్వామి వారిపై భక్తి లేని వారు నామాలు పెట్టుకుని... స్వామికి, టీటీడీ ఆస్తులకు పంగనామాలు పెట్టారని మండిపడ్డారు. ఇతర మతస్తులకు అధికారాన్ని అప్పగించి తిరుమల క్షేత్రాన్ని అపవిత్రం చేశారని దుయ్యబట్టారు.

గత ఐదేళ్లు వీరప్పన్ వారసుల చేతిలో టీటీడీ పాలన సాగిందని సంజయ్ అన్నారు. ఎర్రచందనం కొల్లగొట్టి వేల కోట్లను సంపాదించారని చెప్పారు. ఎర్ర చందనం స్మగ్లర్ల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని... వారిని వదిలి పెట్టబోమని అన్నారు. వేంకటేశ్వరస్వామి వారి దయ, భిక్షతో కార్యకర్త స్థాయి నుంచి కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగానని చెప్పారు.

ఈరోజు బండి సంజయ్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ తో పాటు పలువురు బీజేపీ నేతలు కూడా స్వామి వారిని దర్శించుకున్నారు. కేంద్ర మంత్రి హోదాలో స్వామి వారిని బండి సంజయ్ దర్శించుకోవడం ఇదే తొలిసారి.

# రాష్ట్ర ఆదాయాన్ని పెంచండి.. అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్రంలో ఆదాయం పెంచుకునేందుకు వివిధ శాఖల అధికారులతో సీఎం రేవంత్?, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్ష జరిపారు. ప్రతి శుక్రవారం ఆదాయ వనరుల గురించి సమీక్షలు జరుపుతామన్నారు. జీఎస్టీ ఆదాయాన్ని పెంచుకునేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి సమీక్షించారు.ఆదాయం పెంచుకొనేందుకు వారిలక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. వివిధ శాఖల పని తీరుపు సమీక్షించి ఆయా శాఖల్లో పనితీరు మెరుగుపరచుకోవడానికి యంత్రాంగాన్ని సిద్ధం చేసుకుని ఎటువంటి లీకేజీలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఎన్ఫోర్స్ మెంట్ విభాగాన్ని పటిష్టపరిచి బడ్జెట్ అంచనాలను అందుకోవాలని వివరించారు.

ఆదాయం పెంచుకునేందుకు వాణిజ్య పన్నుల శాఖలో వేసిన కమిటీ పనితీరును సీఎం అడిగి తెలుసుకున్నారు. ఆదాయం పెంచుకునేందుకు కమర్షియల్ టాక్స్ విభాగాల్లో తరచూ సమీక్ష సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఆర్టీసీ ప్రస్తుతం వివిధ బ్యాంకులు, సంస్థలకు చెల్లిస్తున్న రుణాల వడ్డీ రేటును సమీక్ష చేసుకొని, తక్కువ వడ్డీ రేటు ఇచ్చే సంస్థలకు రుణాలు బదలాయింపు చేసుకుని ఆదాయం పెంచుకునే మార్గాలు అన్వేషించాలని సీఎం ఆదేశించారు.

గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఆదాయం పెరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పన్నుల ఎగవేత లేకుండా అన్ని విభాగాలు కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించారు. వార్షిక లక్ష్యానికి అనుగుణంగా ప్రతి విభాగం నెలవారీగా లక్ష్యాలను తయారు చేసుకోవాలని, ఎప్పటికప్పుడు సాధించిన పురోగతిని బేరీజు వేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆదాయం తెచ్చి పెట్టే వనరులపై, పన్నుల వసూళ్లపైన అధికారులు నిక్కచ్చిగా ఉండాలని ఆదేశించారు. సంబంధిత



విభాగాన్ని అవసరమైతే పునరవ్యవస్థీకరించుకోవాలని, ఆదాయం రాబట్టేందుకు వీలైనన్ని సంస్కరణలు చేపట్టాలని దిశా నిర్దేశం చేశారు.

రాష్ట్రానికి ప్రధానంగా ఆదాయం తెచ్చిపెట్టే ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, రవాణా విభాగాల అధికారులతో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు సంబంధిత శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సచివాలయంలో దాదాపు నాలుగు గంటల పాటు సుదీర్ఘంగా ఈ సమావేశంలో వివిధ అంశాలను చర్చించారు. ఎంచుకున్న వార్షిక లక్ష్యంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో జూన్ వరకు వచ్చిన ఆదాయం అంత ఆశాజనకంగా లేదని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్లో పొందుపరిచిన వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఏ నెలకా నెలా మంత్లీ టార్గెట్ ను నిర్దేశించుకొని రాబడి సాధించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇకపై ప్రతి నెలా మొదటి వారంలో నిర్ణీత ఆదాయ లక్ష్యాలపై తాను సమీక్ష నిర్వహిస్తానని ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు. నెలవారీ సమీక్షతో పాటు ప్రతి శుక్రవారం ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క సంబంధిత శాఖల లక్ష్య సాధన పురోగతిపై సమావేశమవుతారని చెప్పారు. ప్రధానంగా రాష్ట్రానికి ఆదాయం తెచ్చిపెట్టే జీఎస్టీ ఆదాయం పెంచుకునే చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు. జీఎస్టీ రాబడి పెంచేందుకు వాణిజ్య పన్నుల శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని, పక్కాగా ఆడిటింగ్ చేయాలని సీఎం ఆదేశించారు. జీఎస్టీ చెల్లింపుల విషయంలో ఎవరినీ ఉపేక్షించకుండా, నిక్కచ్చిగా పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. పెట్రోలు, డీజిల్ పై వాట్ ద్వారా వచ్చే ఆదాయం తగ్గిందని, ప్రత్యామ్నాయంగా ఏవియేషన్ ఇంధనంపై ఉన్న పన్నును సవరించే అవకాశాలను పరిశీలించాలని అధికారులను సూచించారు.

ఎన్నికలప్పుడు మద్యం అమ్మకాలు, విక్రయాలు ఎక్కువగా జరిగినప్పటికీ అంతమేరకు ఆదాయం పెరగకపోవటానికి కారణాలను సీఎం ఆరా తీశారు. అక్రమ మద్యం రవాణాకు అడ్డుకట్ట వేయాలని, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ ను అరికడితే ఆదాయం పెరిగే అవకాశముందని చర్చ జరిగింది. డిస్టిలరీస్ నుంచి మద్యం అడ్డదారి పట్టకుండా నిఘా పెట్టాలని, అందుకు అవసరమైన అధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని సీఎం ఆదేశించారు.

రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ రివర్ ఫ్రంట్ డెవెలప్మెంట్ ప్రాజెక్టులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో హైదరాబాద్లో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని సమావేశంలో చర్చ జరిగింది. ఈ ఆరు నెలల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలతో అటు కమర్షియల్ నిర్మాణాలు పెరిగాయని, గృహ నిర్మాణాలు కూడా అదే వరుసలో పుంజుకుంటాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఇప్పటికే రాష్ట్రంలో భూములు, స్థిరాస్తుల రేట్లు భారీగా పెరిగాయని, అదే స్థాయిలో రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ద్వారా వచ్చే ఆదాయం పెరిగేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇసుక, ఖనిజ వనరుల ద్వారా వచ్చే ఆదాయం పెరగాలంటే అక్రమ రవాణాను, లీకేజీలను అరికట్టాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగించేందుకు పరిమిత కాలం పన్ను సబ్సిడీ అమలైందని, తిరిగి పన్ను వసూలు చేయటం ద్వారా వాహనాల అమ్మకాలపై ఏమైనా ప్రభావం పడిందా.. అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

# ప్రపంచంలోనే తొలి మిస్ ఏఐ.. కిరీటం ఎవరికి దక్కిందో తెలుసా?

**హైదరాబాద్ పెన్ పవర్:**ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్..ఎంతలా దూసుకుపోతోంది..ఏఐ విస్తరించని రంగమంటూ లేదు..ఏఐ మోడల్స్ అందాల పోటీల్లో కూడా పాల్గొంటున్నాయి. ప్రపంచం లో మొదటి సారిగా జరిగిన మిస్ %రూ×% పోటీల్లో కిరీటాన్ని మొరాకో కు చెందిన ఇన్ ఫ్లుయెన్సర్ కెంజా లైలీ గెలుచుకుంది. లైలీ 1500 ఏఐ మోడళ్లలో అగ్రస్థానంలో నిలిచింది. లైలీకి ప్రాణం పోసిన మెరియం బెస్సాకోసం రూ. 16లక్షలు సంపాదించిపెట్టింది. లైలీకి ఇన్ స్టాగ్రామ్ లో లక్షలాది మంది ఫాలొవర్స్ ఉన్నారు. లైలీ ఆహారం, సంస్కృతి, ఫ్యాషన్, అందం, ట్రావెల్స్ వంటి వాటిపై కంటెంట్ ఇస్తుంది. కెంజా లైలీ ఈ వర్చువల్ రోల్ లో మొరాకో గొప్ప వారసత్వాన్ని చాటుకుంది. లైలీ సంస్కృతి, సాంకేతికల ప్రత్యేక కలియికగా రూపం పోసుకుంది. మొత్తం ఏడే భాషల్లో ఫాలోవర్లతో రోజులో 24గంటలూ టచ్ లో ఉంటుంది. మొరాకో సంస్కృతిని గర్వంగా ప్రదర్శించడమే కాకుండా, తన ఫాలోవర్లకు వివిధ రంగాలలలో సమాచారం అందించడమే తన లక్ష్యం అని ఈ ఏఐ మోడల్ చెబుతోంది. పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా రోబో సంస్కృతిపై







అవగాహన కల్పించాలని అకాంక్షిస్తోంది. ఈ పోటీలో ఫ్రాన్స్ కు చెందిన లాలినా వాలినా రెండో స్థానంలో నిలిచింది.. పోర్చుగల కు చెందిన ఒలివియా సీ మూడో స్థానంలో ఉంది. భారత దేశం నుంచి జారా శతావరి టాప్ 10 ఫైనలిస్ట్ లో నిలిచినా టైటిల్ దక్కించుకోలేకపోయింది.

# రెండు రోజుల పాటు తెలంగాణలో వర్షాలు.. ఈదురుగాలులు.. పిడుగులు పడే అవకాశం



హైదరాబాద్ పెన్ పవర్:భాగ్యనగరం జలమయింది. గ్రేటర్? హైదరాబాద్?లో పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. నగరంలోని జూబ్లీహిల్, బంజారాహిల్స్,ఫిలింనగర్, ఖైరతాబాద్, నాంపల్లి, మాసబ్ ట్యాంక్, మెహదీ పట్నం, సికింద్రాబాద్, బేగంపేట, ప్యాట్నీ, సోమాజిగూడ, రసూల్‌పుర, అమీర్‌పేటలో భారీగా ట్రాఫిక్? జాం అయింది. వర్షం పడుతుండటంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య నెలకొంది. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ సహాయక చర్యలు చేపట్టింది.. తెలంగాణ రాష్ట్రానికి వర్ష సూచన చేసింది వాతావరణ శాఖ. రాష్ట్రంలో రానున్న రెండు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బలమైన నైరుతి రుతుపవనాలకు తోడు సముద్రమట్టానికి 3 కిలోమీటర్ల నుంచి ఏడున్నర కిలోమీటర్ల మధ్యలో ఆవర్తనం కొనసాగుతోందని వాతావరణ కేంద్రం అధికారి వెల్లడించారు. ఏపీ తీరం దగ్గర పశ్చిమ మధ్య బంగాళాఖాతం ఆనుకుని కేంద్రీకృతమైన ఆవర్తనం బలహీన పడిందని, దీని ప్రభావంతో తెలంగాణలోని 10 జిల్లాల్లో భారీ వానలు పడతాయని తెలిపారు. మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది వాతావరణ కేంద్రం. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయన్నారు. పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతుల అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు, రైతు కూలీలు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో, కరెంట్ పోల్స్ కింద, ఎత్తైన చెట్ల కింద ఉండకూడదని తెలిపారు. హైదరాబాద్ లోనూ భారీ వాన పడే అవకాశం ఉందని, నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ కేంద్రం అధికారులు సూచించారు. ఇక.. 14, 15 తేదీల్లో హైదరాబాద్ లో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. పగటిపూట ఉష్ణోగ్రతలు 30 నుంచి 32 డిగ్రీల వరకు ఉండే అవకాశం ఉంది అన్నారు. సాయంత్రం మాత్రం వర్షం కురిసే ఛాన్స్ ఉన్నట్లు తెలిపారు. అత్యవసరం అయితేనే బయటకు రావాలని వాతావరణ కేంద్రం తెలిపింది.

# ఆధ్యాత్మిక జీవితానికి.. భౌతిక జీవితానికి తేడా తెలుసా..



హైదరాబాద్ పెన్ పవర్:భౌతిక జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా కింద పడక తప్పదు. ఆధ్యాత్మికంగా ఎదగాలి. ఆధ్యాత్మికమే మనిషిని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని పురాణాలు.. ఆధ్యాత్మిక వేత్తలు చెబుతున్నారు. అసలు భౌతిక జీవితానికి.. ఆధ్యాత్మిక జీవితానికి తేడా ఏంటి? రెండింటిని ఎట్లా బ్యాలెన్స్ చేసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం.

వాస్తవానికి భౌతికం, ఆధ్యాత్మికం రెండు వేరు వేరుగా ఉండవు. ఉన్నది ఒక్కటే జీవితం. మిషిన్ ఎట్లా పని చేస్తది? అది నడవాలంటే ఏం కావాలె? ఏముంటే ఎఫిషియెంట్గా నడుస్తది? అనే విషయాలు చెప్పేదే సాంకేతిక శాస్త్రం (ఇంజినీరింగ్). అలాగే.. మనం ఎక్కడున్నా.. ఏం చేస్తున్నా కూడా ఈ జీవితాన్ని అద్భుతంగా, ఆనందంగా, ఆరోగ్యంగా, శక్తివంతంగా, బాధ్యతా యుతంగా, స్వేచ్ఛగా ఎన్నో అద్భుతాలు సృష్టిస్తూ.. ఎంతో మందికిసాయం చేస్తూ.. ఎట్లా నడపాలె? ఎట్లా జీవించాలి.. ఈ రోజు కంటే రేపు ఎట్లా ఆనందంగా జీవించాలి అని చెప్పే శాస్త్రమే ఆధ్యాత్మికం. అదే జీవిత శాస్త్రం. ఇది అర్థమైతే.. ఆధ్యాత్మికం వేరు.. భౌతికం వేరు అనే తేడాలు కనిపించవు. అవి రెండూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి. మనమే తెలిసీ తెలియక భౌతిక జీవితాన్ని, ఆధ్యాత్మికాన్ని సెపరేట్ చేస్తున్నాము. ఆధ్యాత్మికం అంటే ధ్యానం, మతానికి సంబంధించిన జ్ఞానం అని... భౌతిక జీవితం అంటే ఉద్యోగం, వ్యాపారం,ఇల్లు, వాకిలి సంసారం అనుకుంటున్నాం. ఈ రెండింటిలో దేన్ని ఎంత పరిమాణంలో చూడాలె? దేనికి ఎంత వరకు మనం బాధ్యత వహించాలి? దేనికి ఎంత టైం కేటాయించాలె? దేంట్లో మనం ఎంత శక్తివంతంగా ఉండాలి? ఎక్కడ ఎంత శక్తిని, ఎక్కడ ఎంత జ్ఞానాన్ని ఉపయోగించాలె? అని చెప్పేదే ఆధ్యాత్మిక జ్ఞానం. ఆ జ్ఞానం ఉంటే.. ఎక్కడికెళ్లినా పవర్ఫుల్ గా జీవించవచ్చు.

ప్పుడు ఆధ్యాత్మికం వేరు, భౌతికం వేరు ఎలా అవుతుంది. తెలిసో.. తెలియకో.. మనం అన్నింట్లో అవసరానికి మించి సమయం గడుపుతుంటం. .. అవసరం లేకపోయినా డబ్బులు ఖర్చు పెడుతుంటాం.. అసలు డబ్బు ఎంత కావాలి అంటే బతికేంత కావాలి.

24 గంటలు డబ్బులు డబ్బులు అనుకుంటూ తిరిగితే అది భౌతిక జీవితమైపోతుంది'. 'ఒక మనిషి లేకుంటే నేను చచ్చిపోతా !' అనేది భౌతిక జ్ఞానం. జీవితం కొన్ని విషయాలతోనే ముడిపడిలేదు. మనం ఎన్నో సాధించడానికి పుట్టినామని గుర్తించాలి. అన్నీ సాధ్యం అని చెప్పేదే ఆధ్యాత్మిక జ్ఞానం. కాబట్టి ఆధ్యాత్మికాన్ని, భౌతికాన్ని వేరువేరుగా బ్యాలెన్స్ చేయడం అనేదేం లేదు. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని తీసుకోవాలి. ఎక్కడికెళ్లినా దాన్ని జీవితానికి అన్వయించుకోవాలి. తర్వాత దాన్ని అందరికీ పంచాలి.

# చెప్పులు ఎప్పుడు.. ఎలా పుట్టాయి.. మన కాళ్ల చెప్పులు, షూస్ విశేషాలు ఇవే

హైదరాబాద్ పెన్ పవర్:ఇప్పుడు చెప్పులు కూడా శరీరంలో ఒక అవయవంతో సమానమే! చెప్పులు లేకుండా బయట అడుగు పెట్టలేం! పాదాలను కాపాడే చెప్పులకు కూడా ఒక చరిత్ర ఉందని మీకు తెలుసా... మనిషి సుదీర్ఘ ప్రయాణంలో చెప్పులు చేసిన సాయం కూడా చెప్పుకోదగ్గదే!

మనిషి నేర్చుకోవడం మొదలు పెట్టినప్పటి నుంచే అసలు జీవపరిణామం మొదలైంది.. ఆ ప్రయాణమే ఇక్కడి వరకు తీసుకొచ్చింది. చేపలాగా ఈదాలని నీళ్లలో దూకాడు, మునిగాడు.. తేలాడు,మొత్తానికి ఈత నేర్చుకున్నాడు. ఇప్పుడు చేపనే మించిపోయాడు. పక్షిలాగ ఎగరాలనుకున్నాడు.. ఎగిరాడు, కింద పడ్డాడు... లేచి నిలబడ్డాడ, రెక్కలు కట్టుకుని పక్షికన్నా ఎత్తుకి ఎగిరాడు. కోతులను చూసి, చెట్లు, గుట్టలు ఎక్కడం నేర్చుకున్నాడు.ఇంకా తనతో కలిసి జీవించే ప్రతి జంతువులోనూ ఏ క్వాలిటీ ఉన్నాదాన్ని తనలోకి ఇముడ్చుకున్నాడు.




## గుహల్లో దాచుకుంటున్నప్పుడే

ఆది మానవుడు గుహల్లో నివసించేవాడు. అడవి పొదల్లో... రాళ్ల దప్పల మధ్య సాగేది అతని ప్రయాణం... తిండి కోసం ఒక రోజు జింకను తరుముతూ వెళ్లాడు. 1. అది రాళ్ల గుట్టలను.. ముళ్ల కంపలను దాటుకుంటూ వేగంగా పరుగెత్తింది. చివరికి అది ఆదిమానవుడికి దాతి కత్తికి చిక్కింది. రక్తమోడుతూ గిలగిలా కొట్టుకుంటోంది. కిందకి చూస్తే, అతని పాదాలు కూడా రక్తమోడుతున్నాయి. జింకకు చేసిన గాయం నుంచే రక్తం వస్తోంది. కానీ, దాని కాళ్లకు మాత్రం ఏం కాలేదు. 'జింక వెళ్లిన దారిలో.. అది అడుగులు వేసిన చోటే కదా అడుగులు కూడా పడ్డాయి... దానికేం కాలేదు. ఎందుకు?" అని జింక కాళ్లు పట్టుకుని చూశాడు. దాని కాళ్లకు గిట్టలున్నాయి. అవి గట్టిగా ఉన్నాయి. మరి తనకే గిట్టలు లేవు. తన పాదాలను రక్షించుకోవడానికి గిట్టల్లాంటివి కావాలనుకున్నాడు.జంతువుల చర్మాన్ని కుట్టి తొడుక్కొని చూశాడు... పరిగెత్తాడు. ఉరికినప్పుడు కలిగే రాపిడి వల్ల కాళ్లకు బొబ్బలు వచ్చాయేమో... మెత్తగా ఉండేలా లోపల గడ్డిపెట్టి జంతు చర్మంతో చెప్పులు కుట్టాడు. అవే మనిషి వాడిన మొదటి చెప్పులు అనుకోవచ్చు.

## పాత లెదర్ బూటు ఇదే

లోహ యుగం నాటి మనుషులు చెప్పులు. వాడినట్టు ఆధారాలు ఉన్నాయి. క్రీస్తు పూర్వం వేల ఏళ్ల అప్పుడు వాడిన చెప్పును పురావస్తు శాఖ సంపాదించింది. ఇది 2010లో అర్మేనియా గుహల్లో తవ్వకాలు జరిపినప్పుడు దొరికింది.. ఇది ఇప్పటి లేడిస్ ఏడో నంబర్ సైజు అంత ఉంది. ఇది అప్పటి మానవుడి కుడి కాలి బూటు, ఈ బూటు చుట్టూ గొర్రె పేడ ఉండటం. గుహ. మొత్తం చల్లగా ఉండటం వల్ల ఇప్పటి వరకు పాడవ్వకుండా ఉందని పురావస్తు శాస్త్రవేత్తలు తెలిపారు.

"ఇది లోహ యుగం నాటికీ అప్పటి మనిషి ఎక్కువ దూరం అంటే కనీసం రోజుకు నలభై కిలోమీటర్లు నడిచేవాడు. అలా తన పాదాలను కాపాడుకునేందుకే బూట్లు తయారు చేసుకున్నాడు. ఇది 45 డిగ్రీల వేడినితట్టుకోగలవు" అది ఇప్పటి షూనే పోలి ఉండటం గమనార్హం. ఇక నది తీరాల్లో వెలసిన గ్రీకు లాంటి నాగరికతల్లో మనుషులు చెప్పులు వాడలేదు. మెత్తని మైదాన ప్రదేశంలో ఉండటం వల్ల వాళ్ల పాదాలకు చెప్పుల అవసరం కలగలేదు.

## చెప్పులు.. వివక్ష

రాజుల కాలంలో కేవలం రాజులు, ధనవంతులు, సైనికులు అధికారం అనుభవించే వాళ్లు మాత్రమే చెప్పులు తొడుక్కునేవాళ్లు.. ప్రాచీన రోమన్లు చెప్పులు, బట్టలు వేసుకోవడాన్ని సొసైటీలో ఒక స్టేటస్ గా భావించేవాళ్లు. కొనుక్కొని తీసుకొచ్చిన బానిసల్ని, పేదవాళ్లను చెప్పులే కాదు మంచి బట్టల్ని కూడా తొడుక్కోనిచ్చేవాళ్లు కాదు రోమన్లు. బర్జీలు, ప్రాసిక్యూటర్లు బానిసల ఓనర్లు, అధికారులు మాత్రమే అప్పుడు చెప్పులు వేసుకునే వాళ్లు.. ఎవరైనా వాళ్ల ముందు చెప్పులు తొడుక్కుంటే శిక్షించేవాళ్లు.

ఈ వివక్ష 18వ శతాబ్దం వరకు కొనసాగింది. మన దేశంతో పాటు కొన్ని దేశాల కల్చర్లో ఇంట్లోకి, గుళ్లోకి వెళ్లే ముందు చెప్పులు విడిచి వెళ్లేవారు. పెద్ద కులాల వాళ్ల ముందు చెప్పులు విడిచి పట్టుకుని వెళ్లాలనే దురాచారం మన దగ్గర ఉండేది. ఆ వివక్ష చాలా ఏళు కొనసాగింది. యూరప్లో కూడా అధికారం, డబ్బు ఉన్నవాళ్లు మాత్రమే చెప్పులు వేసుకునేవాడు ఇక్కడ కూడా బానిసలు,పేదవాళ్లు చెప్పులు లేకుండానే జీవితం గడిపారు. ఈ పరిస్థితి 15వ శతాబ్దం వరకు ఉంది.

## ఈ చెప్పులు ఈజిప్టుల సృష్టి

ఆదిమానవప్పుడు జంతువుల చర్మంతో చెప్పులు కుట్టుకునేవాడు. అయితే, నాగరిక ప్రపంచంలో మొదటిసారిగా చెప్పులను తయారుచేసింది మాత్రం ఈజిప్షియన్సే.. వాళ్లు 'పాపిరస్ అనే చెట్టు బెరడును కత్తిరించి, అరికాళ్లకు నాడాలా కట్టుకునే వాళ్లు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న చెప్పుల రూపం ఈజిప్టులో రూపుదిద్దుకున్నదే.

ఇక, చెప్పులకు పూర్తి రూపాన్ని ఇచ్చింది మాత్రం యూరప్ లో ఉండే క్రిస్టియన్స్, యూరప్ దేశాలకు చెందిన క్రిస్టియన్స్ మధ్యయుగంలో ముస్లిం ఆధీనంలో ఉన్న పవిత్ర భూములను తిరిగి స్వాధీనం చేసుకొనే ప్రయత్నం చేశారు. వీళ్లు కాలినడకనే ఏళ్లపాటు విరామం లేకుండా యుద్ధాలు చేసే వాళ్లు అలాంటి పరిస్థితిలో పాదాలను రక్షించుకోవడానికి చాలాకాలం మన్నేలా చెప్పులు తయారుచేసుకున్నారు. తర్వాత కాలంలో చెప్పుల రూపం, చెప్పులకు వాడే పదార్థం కూడా మారుతూ వచ్చింది. కొన్నాళ్లు చెక్కతో చేసిన చెప్పులు తొడుక్కున్నారు. కొంతకాలానికి చెక్కల ప్లేస్లో లోహాలు వచ్చి చేరాయి. తర్వాత నెమ్మదిగా ఇంగ్లండ్, ఇటలీ, ఫ్రాన్స్లో ఎట్రాక్టివ్ మోడల్స్ స్టార్ట్ అయ్యాయి. 15వ శతాబ్దంలో వచ్చిన 'చొపిన్స్' లేడిస్ హైహీల్స్ షూ వెనీస్లో ట్రెండ్ ఇయ్యాయి. ఇవి ఏడు నుంచి ఎనిమిదీ ఇంచుల ఎత్తులో ఉండేవి.

16వ శతాబ్దంలో ఇంగ్లాండ్ రాణి కేథరిన్ డీ ఈ హై హీల్స్ వేసుకోవడంతో వాటికి క్రేజ్ వచ్చింది. దాంతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న రాయల్ లేడీస్ వాటిని తొడగడం స్టార్ట్ చేశారు. వీటితో పొడవుగా కనిపిస్తాం. రాయల్ లుక్ ఉంటుంది' అని వాళ్లు అనుకునేవాళ్లు. ఇప్పుడు మనం వాడుతున్న చెప్పులు లెదర్, ప్లాస్టిక్, రబ్బర్ తో తయారు చేస్తున్నారు. ఒకప్పుడు చేతులతో కుట్టే చెప్పులను ఇప్పుడు అనేక డిజైన్లలో మెషిన్ తో తయారు చేస్తున్నాయి. సైనికులకు ఒక రకమైన బూట్లు, గుట్టలు ఎక్కేవాళ్లకు ఒక రకమైన బూట్లు, ఆటలు ఆడేవాళ్లకు ఒక రకమైన బూట్లు ఇలా చెప్పులు. శాండిల్స్, షూస్ అవసరానికి పరిస్థితులకు తగినట్టు తయారు చేస్తోంది ఫ్యాషన్ ప్రపంచం.

# తినటానికేనా : ఈ బర్గర్ ధర రూ.4.50 లక్షలు.. ఏం బంగారంతో చేశారా ఏంటీ..!

హైదరాబాద్ పెన్ పవర్:బర్గర్ అంటే ఏ 30, 40 రూపాయలు ఉంటుంది.. అదే స్పెషల్ బర్గర్ అయితే ఏ 100, 200 రూపాయలు.. అదే బర్గర్ వెయ్యి, 2 వేలు అంటే అమ్మో అని నోరెళ్లబెడతాం.. అలాంటి బర్గర్ 4 లక్షల 50 వేల రూపాయలు అంటే.. ఏంటీ అవాక్కయ్యారా.. నమ్మశక్యంగా లేదా.. బర్గర్ ఏంటీ.. 4 లక్షల 50 వేల రూపాయలు ఏంటీ అని ఆశ్చర్యపోతున్నారా.. అవును.. ఇప్పుడు మీరు తెలుసుకోబోయే బర్గర్ ధర అదే.. ఇందులో స్పెషల్ ఏంటీ.. ఎందుకు ఇంత ధర.. 4 లక్షల 50 వేల రూపాయలతో తయారయ్యే బర్గర్ లో ఏముంటుందీ అనేది ఓసారి తెలుసుకుందామా... ప్రపంచంలోనే కాస్ట్ లీ బర్గర్ ఇది. ఇటీవల గిన్నిస్ బుక్ లోనూ రికార్డ్ సృష్టించింది. ధరలోనే కాదు రుచిలోను టేస్ట్ అదిరిపోయిందంట. దీని అద్భుతమైన రుచి అరుదైన పదార్థాల కలయిక వల్ల దీనికి ప్రత్యేకత వచ్చిందంట. తీపి, పులుపు, చేదు, ఉమామి రుచుల వల్ల బర్గర్ టేస్ట్ గా ఉంటుందంట.

ఈ బర్గర్ తయారీలో వాగ్యూ బీఫ్తో పాటు, సున్నితమైన కావ్యార్, రుచికరమైన కింగ్ క్రాబ్ పొరలు ఉంటాయి. దీని బన్నులు,

ఉల్లిపాయల రింగ్స్ కూడా సాధారణమైనవి కాదు. డోమ్ పెరిగ్నాన్తో నింపబడిన షాంపైన్తో తయారు చేయబడ్డాయి. ప్రత్యేకత ఏంటంటే.. ఈ బర్గర్ పై పొరను బంగారు రేకులతో అలంకరించారు. ఇన్ని ప్రత్యేకతులున్న బర్గర్ చాలా మంది నుంచి ప్రశంసలు అందుకుంది.

అయితే ఈ బర్గర్ ను అంత ధర పెట్టి తయారు చేయడం చాలా మందికి నచ్చలేదు. దీనిపై సోషల్ మీడియాలో పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రపంచంలో ఆకలి, పేదరికం వంటి తీవ్రమైన సమస్యలతో బాధపడుతున్నప్పుడు ఇంత కాస్ట్ లీ బర్గర్లు అవసరమా? అని ప్రశ్నిస్తున్నారు. అయితే ఈ బర్గర్ ను నెదర్లాండ్ లో రాబర్ట్ జాన్ డి వెన్ అనే చెఫ్ తయారు చేశారు. కొవిడ్ టైం అతనికి ఈ ఆలోచన వచ్చిందంట. అతని ఆలోచన రికార్డుల కోసం కాకుండా ఆకలితో ఉన్నపేదవాళ్లను ఆదుకోవడమంట.



ఎలాగంటే.? ఈ బర్గర్ అమ్మకం వల్ల వచ్చిన డబ్బుతో చెఫ్ రాబర్ట్ వెయ్యి ఆహార ప్యాకెట్లను పేదలకు అందించారు.